క్లుప్తంగా

ఘనంగా పైడితల్లి చండీయాగం



చండీయాగం నిర్వహిస్తున్న వేదపండితులు

విజయనగరం టౌన్: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పైడితల్లి అమ్మవారి జన్మ నక్షత్రమైన మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని రైల్వేస్టేషన్ వద్దనున్న వనంగుడిలో బుధవారం చండీయాగం నిర్వహించారు. వేదపండితులు వెలువలపల్లి నరసింహమూర్తి, సాయి వేద మంత్రోచ్ఛారణల నడుమ యాగ ప్రక్రియ చేపట్టారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

'సీతం'లో సంక్రాంతి సంబరాలు

విజయనగరం అర్బన్: గాజులరేగ పరిధిలో గల సీతం ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా గాలి పటాలు ఎగురవేయడం, ముగ్గుల పోటీలతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విజేతలకు కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ డాక్టర్ బొత్స ఝాన్సీలక్ష్మి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

అవగాహన తప్పనిసరి

విజయనగరం క్రైమ్: అవగాహనతోనే అగ్ని ప్రమాదాలను నివారించగలమని జిల్లా సహాయ అగ్నిమాపక అధికారి వి. సోమేశ్వరరావు అన్నారు. బుధవారం స్థానిక మయూరీ జంక్షన్ సమీపంలో ఉన్న హిమగిరి థియేటర్‌లో సిబ్బందికి అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అగ్నిమాపక అధికారులు పి.మహేష్, ఎస్.రామారావు, ఆర్. శ్రావణ్‌కుమార్, బి.అశోక్ కుమార్, పి. భాస్కరరావు పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ

పూసపాటిరేగ: మండలంలోని గోవిందపురంలో సంక్రాంతిని పురస్కరించుకుని సర్పంచ్ బాలా రామలక్ష్మి సహకారంతో బుధవారం వెయ్యిమంది గ్రామస్తులకు చీరలు, పంచెలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గ్రామస్తులు సంక్రాంతి పండగను సుఖసంతోషాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బాలా అప్పలరాజు, దంగుడుబియ్యపు ఈశ్వరరావు, జనపాల అప్పారావు, బాలా గోపాలరావు, పట్టిపు వాసు పాల్గొన్నారు.

నిత్యావసరాల వితరణ

విజయనగరం: పట్టణ నిరాశ్రయుల వసతిగృహానికి శ్రీ సాయికృష్ణ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు తమవంతు చేయూతనందించారు. నిరాశ్రయులకు అవసరమయ్యే నిత్యావసరాలను క్లబ్ అధ్యక్షుడు తాడ్డి ఆదినారాయణ ఆధ్వర్యంలో బుధవారం అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ గౌరవ సలహాదారు ఎ.తిరుపతిరావు, కోశాధికారి ఆర్‌సీహెచ్ అప్పలనాయుడు, కోట్ల సత్యనారాయణ, ములగ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానానికి ముందుకు రావాలి

విజయనగరం ఫోర్ట్: రక్తదానానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని తిరుమల మెడికవర్ ఆస్పత్రి ఎం.డి తిరుమల ప్రసాద్ పిలుపునిచ్చారు. ఆస్పత్రి ఆవరణలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రతి ఏటా రెండు సార్లు రక్తదాన శిబిరాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ పూర్వపు గవర్నర్ జైన్, ప్రస్తుత అధ్యక్షుడు డాక్టర్ కృష్ణకాంతి, తిరుమల మెడికవర్ సెంటర్ హెడ్ పద్మకుమార్, డాక్టర్ మహేష్, డాక్టర్ పీఎస్‌వీ రామారావు, డాక్టర్ జి. రామారావు, గాంధీ బ్లడ్ డోనర్స్ క్లబ్ అధ్యక్షుడు అబ్దుల్ రవూఫ్, తదితరులు పాల్గొన్నారు.

అరెస్టులు అక్రమం..

విజయనగరంఫూల్‌బాగ్: మెగా డీఎస్సీ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ విజయవాడలోని సీఎం క్యాంప్ ఆఫీస్ వద్ద శాంతియుతంగా ఆందోళన చేసేందుకు వెళుతున్న డీవైఎఫ్ఐ నాయకులను పోలీసులు అరెస్ట్ చేయడం అన్యాయమని డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి తాతి నాయుడు బుధవారం ఒక ప్రకటనలో ఖండించారు. ముఖ్యమంత్రి వెంటనే డీఎస్సీ ప్రకటించాలని కోరారు.

నాగమల్లికి డాక్టరేట్..



విజయనగరం ఫోర్ట్: పట్టణానికి చెందిన డాక్టర్ ఆర్. నాగమల్లికి చెన్నైకి చెందిన మెహర్ యూనివర్సిటీ డాక్టరేట్ పట్టాను ప్రదానం చేశారు. నర్సింగ్‌లో పీహెచ్‌డీ చేసినందుకు గాను యూనివర్సిటీ వారు డాక్టరేట్ అందజేసినట్లు నాగమల్లి తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ఆమెను అభినందించారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

నెల్లిమర్ల: విద్యార్థులు చక్కగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆర్ఐఓ మజ్జి ఆదినారాయణ ఆకాంక్షించారు. బుధవారం స్థానిక సీకేఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎం. సత్యనారాయణ ఆధ్వర్యంలో ఫేర్‌వెల్ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పరీక్షల సమయం తక్కువగా ఉన్నందున ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలని సూచించారు.

అవినీతికి చోటు లేదు..



లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందజేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

- పేదల సొంతింటి కల నెరవేర్చడమే ముఖ్యమంత్రి ధ్యేయం
- సారికలో ఇళ్ల పట్టాలు పంపిణీ చేసిన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

విజయనగరం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నాలుగున్నరేళ్ల పాలన అవినీతికి తావు లేకుండా సాగిందని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. మండల పరిధిలోని సారికలో ఉన్న జగనన్న లేఅవుట్‌లో విజయనగరం పట్టణ పేదలకు బుధవారం ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కోలగట్ల మాట్లాడుతూ, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి 2019 ఎన్నికల సందర్భంగా ఇచ్చిన నవరత్నాల హామీలతో పాటు అనేక హామీలు, సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత అమలు చేశారన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థలతో ఇళ్ల ముంగిటకే పాలన తీసుకువచ్చి దేశానికే ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. వలంటీర్లు చిత్తశుద్ధితో పనిచేసి జగనన్న ఆశయాన్ని ప్రజల్లోకి తీసుకువెళుతున్నారన్నారు. రాజకీయాలు, పార్టీలకతీతంగా అవినీతికి తావులేకుండా సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు చెప్పారు. సొంతింటి కల నెరవేర్చాలన్న ధ్యేయంతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అర్హులైన ప్రతి పేదవాడికీ ఇంటి స్థలంతో పాటు నిర్మాణానికి రుణం మంజూరు చేస్తున్నారని తెలిపారు. గత తెలుగుదేశం పార్టీ పాలన అంతా అవినీతిమయమని, జన్మభూమి కమిటీల రూపంలో జనాలను జలగల్లా పీల్చేశారని ఆరోపించారు. ఎన్నికల దగ్గర పడుతుండడంతో జిత్తులమారి చంద్రబాబు అబద్ధపు మాటలతో ప్రజలను మాయచేయాలని చూస్తున్నారని, ఈ విషయంలో ప్రజలు విజ్ఞతతో ఆలోచించాలని కోరారు. డ్వాక్రా రుణమాఫీ అని చెప్పి మహిళల నెత్తిన శఠగోపం పెట్టిన ఘనుడు చంద్రబాబు అని విమర్శించారు. బాబొస్తే... జాబని నిరుద్యోగులను నిండా ముంచి.. తన కొడుకుకి మాత్రం మంత్రి పదవి అందించాడన్నారు. విజయనగరం మున్సిపాలిటీకి కార్పొరేషన్ స్థాయి కల్పించడంతో పాటు ప్రతి వీధికీ రోడ్డు, ప్రజలకు తాగునీటి సదుపాయం కల్పించిన ఘనత వైఎస్సార్‌సీపీకే దక్కుతుందన్నారు. మరోసారి ఎమ్మెల్యేగా అవకాశం ఇస్తే యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంపై మరింత దృష్టి సారిస్తానని తెలిపారు. అనంతరం 527 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేషన్ మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, నగర పాలక సంస్థ సహాయ కమిషనర్ ప్రసాదరావు, ఫ్లోర్ లీడర్ ఎస్‌వీవీ రాజేష్, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పేదల పక్షపాతి జగన్



కొత్త పింఛన్లు అందుకున్న లబ్ధిదారులతో జెడ్పీటీసీ సభ్యుడు సన్యాసినాయుడు, తదితరులు



విజయనగరం రూరల్: లబ్ధిదారునికి పింఛన్ అందిస్తున్న ఎంపీపీ అప్పలనాయుడు

నెల్లిమర్ల రూరల్: ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పేదల పక్షపాతని జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ సొమ్మును మూడు వేల రూపాయలకు పెంచారని చెప్పారు. మండలంలోని కొండవెలగాడలో బుధవారం పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాల ద్వారా ఆర్థిక సాయం అందిస్తూ నిరుపేదలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. అనంతరం మండల స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన కొండవెలగాడ క్రీడాకారులకు టీ షర్టులు, టోపీలు, క్రికెట్ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ప్రతినిధి మొయిద అక్కోజీ, కార్యదర్శి రమణ, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలన జగనన్నతోనే సాధ్యం..

విజయనగరం రూరల్: సంక్షేమ పాలన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే సాధ్యమని విజయనగరం ఎంపీపీ మామిడి అప్పలనాయుడు అన్నారు. మండలంలోని ద్వారపూడిలో ఇంటింటికీ వెళ్లి పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జగనన్న ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి నేటి వరకు నవరత్నాల పథకాలతో పాటు ఎన్నికల్లో హామీలు, మరెన్నో సంక్షేమ పథకాలు అందించారని కొనియాడారు. సంక్షేమ పాలన అందిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రవీణ్, కృష్ణ, వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

భావితరాలకు అంబేడ్కర్ స్ఫూర్తి తెలియజేయాలి



సంతకం చేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు

నెల్లిమర్ల రూరల్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్ఫూర్తిని భావితరాలకు తెలియజేయడమే లక్ష్యంగా సామాజిక సమతా సంకల్పం పేరుతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు తెలిపారు. మండలంలోని కొండవెలగాడలో సామాజిక సమతా మహోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విజయవాడ నడిబొడ్డున రూ.404 కోట్లతో నిర్మించిన 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ఈ నెల 19న సీఎం జగనన్న ఆవిష్కరిస్తారన్నారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు మద్దతుగా సంతకాల సేకరణ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ప్రతినిధి మొయిద అక్కోజీ, కార్యదర్శి రమణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పనులు అడ్డుకుంటాం..

నెల్లిమర్ల: మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు పారిశుద్ధ్య పనులు అడ్డుకుంటామని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు టీవీ రమణ, జిల్లా కమిటీ సభ్యుడు కిల్లంపల్లి రామారావు, ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ యూనియన్ పట్టణ అధ్యక్షుడు బొగ్గు భాస్కరరావు హెచ్చరించారు. బుధవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయం వద్ద అధికారులు, పాలకవర్గ సభ్యులు ప్రైవేట్ వ్యక్తులతో పారిశుద్ధ్య పనులు చేయించడానికి చేసిన ప్రయత్నాన్ని అడ్డుకున్నారు. ఈ సందర్భంగా కిల్లంపల్లి రామారావు మాట్లాడుతూ, ఒక పక్క తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని నగర పంచాయితీ కార్మికులు 16 రోజులుగా సమ్మె చేస్తుంటే అధికారులు, పాలకవర్గ సభ్యులు ఇతర వ్యక్తులతో పనులు జరిపించాలనుకోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో పలువురు నగర పంచాయితీ కార్మికులు పాల్గొన్నారు.

12న మైత్రీ మీడియా రంగోలి పోటీలు



లక్కీ డ్రా తీస్తున్న మైత్రీ మీడియా డైరెక్టర్ విక్రమ్

- డైరెక్టర్ అవనాపు విక్రమ్

విజయనగరం: సంక్రాంతి సంబరాల్లో భాగంగా మైత్రీ మీడియా, ఎస్ఆర్ షాపింగ్ మాల్ సంయుక్తంగా ఈ నెల 12న గురజాడ కళాభారతిలో రంగోళి పోటీలు నిర్వహించనున్నట్లు మైత్రీ మీడియా డైరెక్టర్ అవనాపు విక్రమ్ తెలిపారు. బుధవారం స్థానిక మైత్రీ మీడియా కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు చాటి చెప్పేందుకు, మగువల్లోని కళా నైపుణ్యతను వెలికి తీసేందుకు ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రంగోళి పోటీల్లో మొదటి బహుమతిగా బంగారు నక్లెస్, రెండో బహుమతిగా బంగారు చెవిదిద్దులు, మూడో బహుమతిగా స్మార్ట్ టీవీలతో పాటు పది కన్సొలేషన్ బహుమతులు అందిస్తామని తెలిపారు. అలాగే ముగ్గుల పోటీలో పాల్గొనే ప్రతి ఒక్కరికీ బహుమతి ఇస్తామని తెలిపారు.

12వ తేదీన బహుమతి ప్రదానం

కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ మైత్రీ మీడియా 2023 డిసెంబర్ 31న నిర్వహించిన ట్రెజర్ హంట్‌లో వేల సంఖ్యలో పాల్గొన్న ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలుపుతూ, ట్రెజర్ హంట్ కాంపిటేషన్‌లో అర్హత పొందిన వారికి బుధవారం లక్కీడ్రా నిర్వహించారు. మైత్రీమీడియా డైరెక్టర్ అవనాపు విక్రమ్ పర్యవేక్షణలో కేబుల్ ఆపరేటర్ల సంఘం అధ్యక్షుడు అన్సారీ, సభ్యులు గుణ, తదితరులు డ్రా తీశారు. విజేతలకు జనవరి 12న గురజాడ కళాభారతిలో బహుమతులు అందజేస్తామన్నారు.

రామనారాయణంలో..

విజయనగరం రూరల్: ఈ నెల 12న ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రం రామనారాయణంలో ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు ఆలయ ట్రస్టీ నారాయణం శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వారికి అదేరోజు బహుమతులు ప్రదానం చేస్తామని పేర్కొన్నారు. ఆరోజు ఉదయం 10 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయని, మధ్యాహ్న భోజన సదుపాయం ఉంటుందన్నారు. అలాగే ఈ నెల 14న భోగి పర్వదినాన్ని పురస్కరించుకుని గోదాదేవి కల్యాణం నిర్వహించనున్నట్లు తెలిపారు.

అత్యంత ప్రతిష్టాత్మకంగా 'ఆడుదాం ఆంధ్రా' పోటీలు

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



విజయనగరం: క్రికెట్ ఆడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల



డెంకాడ: వాలీబాల్ ఆడుతున్న ఎమ్మెల్యే బడ్డుకొండ

విజయనగరం: ప్రతిభ గల క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహించడంలో భాగంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా రెండో దశ పోటీలు ఉత్సాహభరిత వాతావరణంలో బుధవారం ప్రారంభమయ్యాయి. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, క్రికెట్ పోటీలను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ, ఈ నెల 23 వరకు విజ్జీ, రాజీవ్ స్టేడియం, పోలీస్ బ్యారెక్స్ మైదా నాల్లో పోటీలు నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో ఆర్. శ్రీరాములనాయుడు, ప్రసాదరావు, కాళ్ల సూరిబాబు, ఎం.అచ్యుత్‌కుమార్, పాల్గొన్నారు.

పోటీతత్వాన్ని అలవర్చుకోవాలి

పూసపాటిరేగ: క్రీడలలో పోటీతత్వాన్ని అలవర్చుకోవాలని ఎంపీపీ మహంతి కల్యాణి అన్నారు. మండలంలోని కుమిలి, పూసపాటిరేగ, వెంపడాం సచివాలయాల పరిధిలో మండల స్థాయి క్రీడా పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు, మండల వైస్ ఎంపీపీ ఎస్. సత్యనారాయణరాజు, జేసీఎస్ కన్వీనర్ మహంతి శ్రీనివాసరావు, మహంతి జనార్దనరావు, గుజ్జు సురేష్ రెడ్డి, పడాల శ్రీధర్, గాబు సూరప్పన్నరెడ్డి, పి.లక్ష్మీనారాయణ, కొత్తకోట శ్రీరాములు, టొంపల సీతారాం, పిన్నింటి కుమార్, ఎంపీడీఓ ఎం. రాధిక, తహసీల్దార్ ఇ. భాస్కరరావు, పీడీ కమలనాభరావు, పీఈటీలు సత్యనారాయణ, లీలాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక, మానసిక ఆరోగ్యం

డెంకాడ: క్రీడలతో శారీరక, మానసిక ఆరోగ్యం కలుగుతుందని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. చింతలవలస ఐదో ఏపీఎస్పీ బెటాలియన్‌లో నిర్వహిస్తున్న మండల స్థాయి క్రీడా పోటీలను ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజల్లో క్రీడల పట్ల ఆసక్తిని పెంచాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా పోటీలు నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్మునాయుడు, వైఎస్సార్‌సీపీ యువజన నాయకుడు బడ్డుకొండ ప్రదీప్, సర్పంచ్ కోరాడ కనకరాజు, జేసీఎస్ కన్వీనర్ సారిక గౌరి, మండల ప్రత్యేకాధికారి జమదగ్ని, ఎంపీడీఓ స్వరూపారాణి, డీటీ సూర్యకాంతం, వైఎస్సార్‌సీపీ నాయకులు సంచాన కృష్ణమూర్తి, పుర్రె రాము పాల్గొన్నారు.

ఉత్సాహంగా...

విజయనగరం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం... ఆంధ్రా మండల స్థాయి క్రీడా పోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. మండలంలోని కొండకరకాంలో జరిగిన పోటీలను ఎంపీపీ మామిడి అప్పలనాయుడు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గంటా వెంకటరావు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, పలు గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించాలి

పూసపాటిరేగ: మండలంలోని గైతులుచోడవరంలో సీపీ ఆక్వా పరిశ్రమ ప్రతినిధులు ఆక్రమించుకున్న ప్రభుత్వ భూములను కాపాడాలని మాజీ సర్పంచ్ నల్ల అప్పలరాజు కోరారు. ఈ మేరకు తహసీల్దార్ ఇ. భాస్కరరావును బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. పరిశ్రమలో సుమారు ఆరెకరాల ప్రభుత్వ భూమి ఉందన్నారు. పరిశ్రమలో 15 సంవత్సరాలుగా పనిచేస్తున్న కార్మికులను సైతం తొలగించారని తెలిపారు. ఆక్రమణలను తొలగించడంతో పాటు కార్మికులను విధుల్లోకి తీసుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వ లక్ష్యాలు

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి
- 25వ డివిజన్ వసంత విహార్‌లో నూతన కుళాయిలు, ఆరోగ్య సురక్ష శిబిరాలు ప్రారంభం

విజయనగరం: అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. నగరంలోని 25వ డివిజన్ పరిధి రైల్వేస్టేషన్ రోడ్డులో గల వసంతవిహార్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఏడు పబ్లిక్ కుళాయిలను, జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ, గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాలు, వార్డు పర్యటనల్లో వసంత విహార్ వాసులు కుళాయిలు లేక ఇబ్బంది పడుతున్నట్లు గుర్తించామన్నారు. వెంటనే పబ్లిక్ కుళాయిలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రజా సమస్యలను పరిష్కరించడమే ధ్యేయంగా నిరంతరం పనిచేస్తున్నట్లు తెలిపారు. అలాగే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం తొలి విడత విజయవంతం కావడంతో, రెండో విడతలో భాగంగా తాజాగా వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. అంతకుముందు వసంత్ విహార్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు కోలగట్లకు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు యడ్ల రాజేష్, బలివాడ కాశీపతిరావు, పార్వతి, సుజాత, మురళి, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న 'మ్యాథ్స్' ఎగ్జిబిషన్

విజయనగరం అర్బన్: పట్టణంలోని ఇన్‌స్పైరో స్కూల్‌లో బుధవారం జరిగిన 'మ్యాథ్స్ ఎగ్జిబిషన్' పలువురిని ఆకట్టుకుంది. ఇందులో భాగంగా గణిత అవధానం అనే విభిన్న ప్రక్రియ ప్రముఖ గణిత శాస్త్రవేత్త చంద్రశేఖర శాస్త్రి ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం సంక్రాంతి సంబరాలు వేడుకగా నిర్వహించారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్లు రవి.కే.మండ, వవ్వా శ్రీనివాస్, బత్తుల చందు, ప్రిన్సిపాల్ రాగ సుధ, చంద్రశేఖర శాస్త్రి, కేవీవీ సత్యనారాయణ, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతంలో మహిళల పాత్ర కీలకం

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



పార్టీ మండల మహిళా విభాగం అధ్యక్షురాలు శశి భార్గవిని అభినందిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

విజయనగరం: వైఎస్సార్‌సీపీ బలోపేతంలో మహిళల పాత్ర కీలకమని, రానున్న ఎన్నికల్లో కూడా సహకారం అందించాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఆకాంక్షించారు. బుధవారం సాయంత్రం కోలగట్ల స్వగృహంలో నిర్వహించిన మహిళా సదస్సులో పార్టీ మండల మహిళా విభాగం అధ్యక్షురాలిగా శశిభార్గవిని నియమిస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాజకీయాలలో మహిళా చైతన్యం మరింతగా పెరగాలన్నారు. మహిళా కమిటీలను ఏర్పాటు చేసి తద్వారా అన్ని గ్రామాలలో పర్యటించి మహిళా నాయకత్వాన్ని బలోపేతం చేయాలని సూచించారు. విద్యావంతులైన మహిళలు పార్టీకి మద్దతుగా నిలిచే విధంగా చూడాలన్నారు. ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉండి సహకారం అందించాలని చెప్పారు. శశిభార్గవి మాట్లాడుతూ, తనను పార్టీ మండల మహిళా విభాగం అధ్యక్షురాలిగా ఎంపిక చేసిన కోలగట్ల డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామికి కృతజ్ఞతలు తెలియజేశారు. నిరంతరం పార్టీ పటిష్టతకు కష్టపడి పనిచేస్తానని తెలిపారు. కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షుడు మామిడి అప్పలనాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు నడిపేన శ్రీనివాసరావు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, మహిళలు పాల్గొన్నారు.

రూ.1.52 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు

- మేయర్ వెంపడాపు విజయలక్ష్మి



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి

విజయనగరం: ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా నగరంలోని వివిధ డివిజన్‌లలో రూ.1.52 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు కార్పొరేషన్ మేయర్ వెంపడాపు విజయలక్ష్మి తెలిపారు. నగరంలోని 4వ డివిజన్ బాబామెట్ట ప్రాంతంలో రోడ్ల నిర్మాణాలకు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మాటల మనిషి కాదని.. చేతలు చేసే వ్యక్తి అని కొనియాడారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంతో పాటు వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాల్లో భాగంగా గుర్తించిన సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా నూతన అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. అభివృద్ధి కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లో జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో 4వ డివిజన్ కార్పొరేటర్ మారోజు శ్రీనివాసరావు, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్పొరేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రహదారులు, కాలువల నిర్మాణాలకు శంకుస్థాపనలు

విజయనగరం: నగరంలో వివిధ డివిజన్‌లలో కోటీ 35 లక్షల రూపాయలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి శంకుస్థాపన చేశారు. 17, 19, 29, 30 డివిజన్‌లలో రహదారులు, కాలువల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అన్ని ప్రాంతాలలో మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నామన్నారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి నగర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

రామతీర్థం చేరుకున్న అయోధ్య అక్షతలు

- ఈ నెల 22వరకు తారక మంత్ర జప యజ్ఞం



అయోధ్య అక్షతల కలశాన్ని ఊరేగింపుగా దేవాలయంలోకి తీసుకువెళ్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలోని శ్రీ సీతారామస్వామి దేవస్థానానికి అయోధ్య నుంచి స్వామి వారి అక్షతలు బుధవారం చేరుకున్నాయి. సమరసత సేవా సంస్థ ప్రతినిధులు పవిత్ర అక్షింతల కలశాన్ని దేవస్థాన అర్చకులకు అందజేశారు. అనంతరం మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్చారణ నడుమ కలశాన్ని దేవాలయంలో ప్రదక్షిణగా ఊరేగించి స్వామిసన్నిధిలో ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. ఈ నెల 22వ తేదీన అయోధ్య రామాలయంలో శ్రీరామ ప్రతిష్ట మహోత్సవం వరకు కలశానికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని దేవస్థాన అర్చకులు తెలిపారు. అయోధ్య రామ మందిరంలో విగ్రహ ప్రతిష్ట ముగిసిన అనంతరం పవిత్ర అక్షింతలను భక్తులకు అందిస్తామని చెప్పారు. భక్తులు తారకమంత్రాన్ని 108 సార్లు జపిస్తూ పవిత్ర అక్షింతలను కలశంలో వేయాలని సూచించారు. ఆలయంలో జరగనున్న తారక మంత్ర జపయజ్ఞంలో భక్తులు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో దేవస్థానం సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

'ఆరోగ్య సురక్ష'ను సద్వినియోగం చేసుకోండి

- నగర పంచాయతీ ఛైర్‌పర్సన్ బంగారు సరోజిని



హెల్త్‌క్యాంప్ పరిశీలిస్తున్న ఛైర్‌పర్సన్ సరోజిని

నెల్లిమర్ల: ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని నగర పంచాయతీ ఛైర్‌పర్సన్ బంగారు సరోజిని అన్నారు. నగర పంచాయతీ పరిధి మొయిద జంక్షన్-01 సచివాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష ఆరోగ్య శిబిరం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు డి.రామునాయుడు, చంద్రమౌళి, తిరుమలదేవి, టి.నారాయణరావు రోగులను పరీక్షించి మందులు అందజేశారు. అనంతరం స్థానిక ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో జరుగుతున్న ఆడుదాం ఆంధ్రా పోటీలను పర్యవేక్షించారు. కార్యక్రమంలో వైస్‌ఛైర్మన్ ఎస్. రామారావు, మండల ప్రత్యేకాధికారి కె.శ్రీనివాస్, ఎంపీడీఓ జి.రామారావు, నగర పంచాయతీ కమిషనర్ పి.బాలాజీప్రసాద్, వార్డు కౌన్సిలర్లు, కో ఆప్షన్ మెంబర్లు, పీఈటీఉల, పీడీఉల, తదితరులు పాల్గొన్నారు.